క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయస్వామి విగ్రహం


ఆలయం ఎదుట ధ్వజస్తంభం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామంలో జీర్ణోద్ధరణ గావించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు రోహిత్‌శర్మ, సురేష్ శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ గావించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు


మల్లికార్జునరెడ్డి


భూపాలుడు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల, రేవనూరు పోలీస్‌స్టేషన్లకు కొత్తగా నియమించిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో కోవెలకుంట్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న వరప్రసాద్ రుద్రవరం పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో అన్నమయ్య జిల్లా ముడివేడు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని నియమించడంతో ఆయన విధుల్లో చేరారు. అలాగే మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రాంమోహన్‌రెడ్డి మహానంది మండలానికి బదిలీ కాగా వెలుగోడు ఎస్‌ఐ భూపాలుడును నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐలు మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు.

విధుల్లో చేరిన నందవర్గం ఎస్‌ఐ


వెంకటసుబ్బయ్య

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవర్గం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా బీటీ వెంకట సుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన తిరుపాల్ బ్రహ్మణకొట్కూరు పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో గడివేముల ఎస్‌ఐగా ఉన్న వెంకట సుబ్బయ్య ఇక్కడికి వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని.. అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.

బాధ్యతలు తీసుకున్న రాచర్ల ఎస్‌ఐ


లక్ష్మణరావు

ప్యాపిలి: సర్కిల్ పరిధిలోని రాచర్ల ఎస్‌ఐగా లక్ష్మణరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రమోహన్ కోసిగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీశైలం ఎస్‌ఐ లక్ష్మణరావు విధుల్లో చేరారు. నాటుసారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి శ్రీనివాసులుపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు.. ఈ నెల 12వ తేదీ రాత్రి బనగానపల్లె రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి శ్రీనివాసులును పాత కక్షలతో అదే కాలనీకి చెందిన గూటం సాయితేజ, మదన్ శివ, గాలిగాల్ల శివదుర్గ ప్రసాద్ రాళ్లు, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం దుర్గాపేటలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు.

ప్రజల విశ్వాసంతోనే మనుగడ


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అతిథులు

డోన్ టౌన్: నాణ్యత ప్రమాణాలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించినప్పుడే ప్రజల్లో విశ్వాసం పొందగలమని విజయశ్రీ జ్యువెలర్స్ అధినేత కె.రామాంజనేయుల ఆచారి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంజీవరెడ్డి అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన విజయశ్రీ జ్యువెలర్స్ అండ్ డైమండ్స్ ప్రారంభోత్సవం సందర్భంగా తీసిన లక్కీడిప్ విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. పట్టణానికి చెందిన రేష్మా విజేతగా ఎంపిక అయ్యారు. కె.మధుసూదన ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలు.. అర్హులకు అందేనా?

- గత టీడీపీ పాలనలో కార్యకర్తలకే కేటాయించారని విమర్శలు
- మళ్లీ అదే ప్రభుత్వంలో తెరపైకి మినీ గోకులాల షెడ్లు
- నియోజకవర్గానికి 150 యూనిట్లు మంజూరు


గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన గోకులం పశువుల షెడ్డు

సంజామల: గత టీడీపీ ప్రభుత్వ (2014–19) హయంలో పశువులు ఉన్న పాడిరైతులు షెడ్లు నిర్మించుకోవడానికి గోకులాల పేరుతో పథకం తీసుకొచ్చింది. పశువుల షెడ్లకు 10 శాతం, గొర్రెలు, మేకలకు 30 శాతం, కోళ్లకు 30 శాతం వాటా రైతులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన వాటా ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రాయితీ చెల్లిస్తుంది. అయితే అర్హులైన పాడిరైతులకు కాకుండా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే కేటాయించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసింది. ఇటీవల మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా మళ్లీ మినీ గోకులాలను తెరపైకి తెచ్చింది.

షెడ్ల నిర్మాణాలకు రాయితీ

బనగానపల్లె నియోజకవర్గానికి 150 మినీ గోకులాలు మంజూరయ్యాయి. మండలానికి 25 షెడ్లు టార్గెట్ ఇచ్చారు. వాటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి చేశారు. గ్రామ సభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. పశువుల షెడ్లకు 90 శాతం, మేకలు, గొర్రెల షెడ్లకు 70 శాతం, కోళ్ల షెడ్లకు 70 శాతం ప్రభుత్వం నుంచి రాయితీ అందుతుంది. షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి యజమానుల ఖాతాకు రాయితీ చెల్లిస్తారు.

టీడీపీ కార్యకర్తలకు లబ్ధి కోసమే..

సంజామల మండలంలో సుమారు 500 మంది పాడి రైతులు ఉన్నారు. మండలానికి 25 మినీ గోకులాలు మంజురయ్యాయి. పేరుకు దరఖాస్తు ప్రక్రియ, అర్హుల ఎంపిక అంటూ హడావుడి చేస్తున్నా గతంలో మాదిరిగా టీడీపీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చుతారని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి, రైతు భరోసా, ఇళ్ల నిర్మాణాలు, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న చేదోడు, జగనన్న ఆసరా తదితర పథకాలు పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని పేర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో మినీ గోకులాలు అరకొరగా మంజూరు చేసి తమ కార్యకర్తలకు లబ్ధి చేయడానికి తీసుకొచ్చారని విమర్శలు వస్తున్నాయి.

బనగానపల్లె నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులాలు

మండలం	యూనిట్లు
బనగానపల్లె	50
కోవెలకుంట్ల	25
అవుకు	25
సంజామల	25
కొలిమిగుండ్ల	25
మొత్తం	150

అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు



మినీ గోకులాలకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను పరిశీలించి ఎంపిక చేస్తాం. పశువులకు 10 శాతం, గొర్రెలు, మేకలకు 30 శాతం, కోళ్లకు 30 శాతం వాటా చెల్లించాలి. గ్రామా సభ తీర్మాణం తప్పనిసరిగా ఉండాలి. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

–డాక్టర్ మోహన్‌రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ, సంజామల

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ


చౌడేశ్వరిదేవి అమ్మవారు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి పల్లకిలో ఆశీనులు చేశారు. పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, ఊయల సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షంతో విద్యుత్‌కు అంతరాయం

అవుకు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యుత్ అధికారులు అప్రమత్తమై మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గుండ్లశింగవరం నుంచి బనగానపల్లె వరకు ఉన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. సమస్య ఉన్న లైన్లకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు. బయట వర్షం, ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు నాలుగు గంటల పాటు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

దోషులను ఉరి తీయాలి


కోవెలకుంట్లలో విద్యార్థుల మానవహారం


చిన్నమాల్కాపురంలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



కొవ్వొత్తుల ర్యాలీలో విద్యార్థులు

కోవెలకుంట్ల: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దోషులను బహిరంగంగా ఉరి తీయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మాబు ఉసేన్ డిమాండ్ చేశారు. సోమవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సీబీఐ కేసు దర్యాప్తును ముమ్మరం చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు డాక్టర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె సుబ్బరాయుడు, వివిధ సంఘాల నాయకులు కత్తి ఓబులేసు, రెడ్డిపల్లె ఓబయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైద్యుల నిరసన

డోన్ రూరల్: హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. దుర్మార్గులను కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎంపీహెచ్ఈఓ ప్రభాకర్, సూపర్‌వైజర్‌లు చెన్నయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

డోన్ టౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌నాయక్, ఆశోక్ డిమాండ్ చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని సోమవారం సాయంత్రం విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశంలో మహిళలపై దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చట్టాలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నూతన వధువు అదృశ్యం


పద్మలత (ఫైల్)

సంజామల: నూతన వధువు అదృశ్యమైన ఘటన ఆకుమల్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమణయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కైప నిరంజన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం ఎదుపు గ్రామనికి చెందిన కుమార్‌స్వామి కుతూరు పద్మలతను ఈ నెల 10వ తేదీ వివాహం చేసుకుని ఆకుమల్లకు చేరుకున్నారు. 13వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పద్మలత ఉంది. ఉదయం చూసేసరికి కనిపించలేదు. బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త కైప నీరంజన్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

డోన్ టౌన్: పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన పుజారి దేవేంద్రయ్య, అబ్బిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తోక నరసింహులు బైక్‌పై కొండపేటకు వెళ్లి వస్తుండగా బేతంచెర్ల సర్కిల్‌లో కారు ఢీకొని ఆగకుండా బేతంచెర్ల రోడ్డు వైపు వెళ్లింది. ఇరువురి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పడిగె శ్రీను నాటుసారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

5 లీటర్ల సారా స్వాధీనం

ప్యాపిలి: జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాధవరం గ్రామంలో నాటుసారా విక్రేతను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగార్జున సోమవారం తెలిపారు. నిందితుడి నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన మాదిగ నరసింహులును హుసేనాపురం గ్రామానికి చెందిన గొల్ల నాగేశ్వరరావు, గొల్ల పాండు, గొల్ల సుధాకర్ కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ సోమవారం తెలిపారు.

ఘనంగా జియారత్ వేడుకలు


మీరావలికి ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్టపై వెలసిన మీరావలి దర్గాలో సోమవారం జియారత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏటా మొహర్రం ముగిసిన 40వ రోజున జార్తలు నిర్వహించడం ఆనవాయితీ. దర్గా కమిటీ అధ్యక్షుడు సత్యరాజు ఆధ్వర్యంలో జియారత్ వేడుకలు జరిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై మీరావలికి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

డోన్ టౌన్: సరదాతో మొదలైన వ్యసనం జీవితాన్ని సర్వ నాశనం చేస్తుందని.. విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. సరైన మార్గంలో నడుచుకుంటే జీవితాంతం సుఖ పడుతారని.. విలాసాలకు అలవాటు పడితే జీవితాంతం కష్టపడుతారని అన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ మంచి ప్రశ్నలు అడిగిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంజామలలో భారీ వర్షం


ఎగ్గొని గ్రామ సమీపంలో చెరువును తలపిస్తున్న పొలం

సంజామల: మండల కేంద్రంతో పాటు ఆకుమల్ల, ముదిగేడు, ఎగ్గొని తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చెరువులను తలపించేలా పొలాల్లో నీరు చేరాయి.

బనగానపల్లెలో మోస్తరు వర్షం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నందివర్గం, పండ్లాపురం, యాగంటిపల్లె, పాతపాడు క్రిష్టగిరి, ఇల్లూరుకొత్తపేట గ్రామాల్లో వర్షం పడింది. దీంతో మండల ప్రజలకు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది. బనగానపల్లె పట్టణంలో సాయంత్రం 6.30 గంటల నుంచి అరగంట సేపు వర్షం కురిసింది. వరినాట్లు వేసుకునే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ


ప్యాపిలి: పోలీసులకు రాఖీలు కడుతున్న విద్యార్థులు


బేతంచెర్ల: నగర పంచాయతీ చైర్మన్‌కు రాఖీలు కడుతున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా బనగానపల్లె నియోజకవర్గంలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఒకరికొకరు జీవితాంతం రక్షగా ఉండాలనే సందేశానికి సూచికగా అన్నలు, తమ్ముళ్లకు చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఘనంగా రాఖీ పండుగ

ప్యాపిలి: రాఖీ పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు రాఖీలు కట్టారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: మండలంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అన్నలు, తమ్ములకు చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సీఐ డి. వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డికి విద్యార్థులు రాఖీ కట్టారు.

చౌడేశ్వరిదేవికి వెండి నక్షత్ర హారతి కానుక


ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌కు అందజేస్తున్న దాత ప్రవీణ

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన వర్చ్యువల్ ఆటోమేషన్స్ అధినేత ప్రవీణ సుమారు రూ.1.72 లక్షల విలువ చేసే వెండి నక్షత్ర హారతి, బంగారు ముక్కు పుడకను విరాళంగా అందజేశారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ మృతి


భర్త మృతితో రోదిస్తున్న భార్య లీలావతి

బేతంచెర్ల: పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని హెచ్‌కొట్టాలలో జరిగింది. వివరాలు.. డోన్ మండలం కొచ్చెర్వుకు చెందిన ఎర్రమల కుమారుడు బలిజ రమేష్(32) డోన్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హెచ్.కొట్టాల క్వారీ నుంచి చిప్స్ తయారు చేసే బొగడ రాయిని డోన్ పరిశ్రమలకు తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం యథావిధిగా బేతంచెర్ల మండలం హెచ్.కొట్టాలలోని క్వారీలో లోడింగ్ కోసం ఇద్దరు కార్మికులతో కలిసి వచ్చాడు. మధ్యాహ్నం వర్షం కురవడంతో ముగ్గురు ట్రాక్టర్ ట్రాలీ కింద కూర్చున్నారు. పిడుగు పడడంతో బలిజ రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కార్మికులు భార్య లీలావతికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతునికి భార్య లీలావతి, అంజలి, విష్ణు సంతానం. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో డోన్‌కు తరలించారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన వడ్డె నాగరాజుపై అదే కాలనీకి చెందిన కిరణ్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలీ సోమవారం తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని ఫొటోగ్రాఫర్లు సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తేజ ఫొటో స్టూడియోలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. సంఘం నాయకుడు కొంకా సుబ్బయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఫొటోగ్రాఫర్లు చంటి, కలీల్, రమణ, చాంద్‌బాషా, వెంకటరమణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు సర్వే


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌బాబు

బేతంచెర్ల: తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ ప్రకాశ్ బాబు బీఎల్‌ఓలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మధు, ఆర్ఐ శ్రీదేవితో కలిసి ఆయా గ్రామాల బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచి ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. డబుల్ ఎంట్రీలు, ఫొటోలు సరిగ్గా లేనివాటిని గుర్తించాలన్నారు. నూతన ఓటరు నమోదు, మృతి చెందిన ఓటర్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పారదర్శక జాబితా సిద్ధం చేయాలన్నారు.

వీఆర్వో, సర్వేయర్‌కు మెమోలు జారీ

సాక్షి ఎఫెక్ట్

కొలిమిగుండ్ల: ఇటిక్యాల రెవెన్యూ పరిధిలోని 738, 765 సర్వే నంబర్లకు చెందిన ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌ఓసీలు ఇచ్చిన వీఆర్వో చెన్నయ్య, కనకాద్రిపల్లె గ్రామ సచివాలయ సర్వేయర్ జగదీష్‌కు సోమవారం తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి మెమోలు జారీ చేశారు. ప్రభుత్వ భూమిలో ఇష్టానుసారంగా వంద మందికి పైగానే ఎన్‌ఓసీలు ఇవ్వడంపై ఈనెల 17న సాక్షి దినపత్రికలో 'భూచోళ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇద్దరికి మెమోలు ఇవ్వడంతో పాటు గ్రూపుగా ఏర్పడి ప్లాట్లు వేసి విక్రయాలు, రిజిస్ట్రేషన్లు చేయించిన వారిపై చర్యలు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. రెండు సర్వే నంబర్లలో ఎంత మందికి ఎన్‌ఓసీలు ఇచ్చారు? ఎంత మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు? అనే వాటిపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే చాలా మంది నిర్మాణాలు చేపట్టడంతో వారికి నోటీసులు జారీ చేసి ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటిక్యాల రెవెన్యూలోని వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ల నుంచి ఇకపై రిజిస్ట్రేషన్లు చేయరాదని అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి జిల్లా కార్యాలయం నుంచి ఆదేశాలు సైతం ఇచ్చారు.